క్లుప్తంగా

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి



పల్లిపాలెం పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం

సఖినేటిపల్లి: పది పరీక్షలలో ఉపాధ్యాయ సూచనలు అనుసరించి ప్రణాళికా బద్ధంగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సూచించారు. బుధవారం పల్లిపాలెం ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఆయన ముఖాముఖీ నిర్వహించారు. అన్ని సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలను రాబట్టారు. అనంతరం స్టాఫ్‌తో ఒక సమావేశం నిర్వహించారు. బోధనా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాఠశాల హెచ్ఎం ఎం.రత్నరాజు, ఉపాధ్యాయులు ప్రేమ్‌చంద్, బి.జ్యోతి పాల్గొన్నారు.

క్రీడా మైదానం పనుల పరిశీలన

అయినవిల్లి: ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పీఎం శ్రీ పథకంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.మధుసూదనరావు బుధవారం సందర్శించారు. పాఠశాల సిబ్బందిని పనులు జరుగుతున్న తీరు ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి టి.రాంబాబు, ఐఈడీఎస్ఎస్ అధికారి ఎంవీవీ సత్యనారాయణ, ఏంఈఓ-2 పి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేడు పల్లె పండగ ప్రారంభం

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండగ గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రారంభం కానున్నట్టు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, బడుగువానిలంక, మడికి, చెముడులంక గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు భూమి పూజ చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆయన సూచించారు.

ఫలించిన ప్రజాప్రతినిధుల కృషి

ఆలమూరు: ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు కొత్తూరు-వెదురుమూడి రోడ్డు పక్కన మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు చేసిన కృషి ఫలించింది. స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో బుధవారం మద్యం వ్యాపారులు ఏర్పాటు చేయనున్న దుకాణాన్ని పెదపళ్ల, చింతలూరు, పినపళ్ల, పెదపళ్ల, సూర్యారావుపేటకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ఆ గ్రామ ప్రజా ప్రతినిధులు వినతిని గౌరవించిన మద్యం వ్యాపారులు రోడ్డు పక్కన మద్యం దుకాణం ఏర్పాటును విరమించుకుని ప్రత్యామ్నాయంగా కలవచర్ల రోడ్డులోని గోదాములో ఏర్పాటు చేసుకున్నారు. వ్యాపారులు తగదాలకు పోకుండా మద్యం దుకాణం తరలించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు చేసిన పోరాటాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

విద్యుత్‌కు అంతరాయం

అయినవిల్లి: తొత్తరమూడి గ్రామంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగి పడడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే చెట్లలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలపై చెట్లు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

మద్యం షాపుల యజమానులు వీరే

ఆలమూరు: మండలంలోని ఐదు మద్యం షాపులకు సంబంధించి లాటరీలో దక్కించుకున్న యజమానులు బుధవారం కార్యకలపాలను ప్రారంభించారు. వట్టికూటి సతీష్‌బాబు ((షాపు నంబర్ 96), వట్టికూటి సతీష్‌బాబు (షాపు నంబర్ 97), వాసర్ల వెంకట సత్యప్రసాద్ (షాపు నంబర్ 98), యేర్నమనేని సత్యనారాయణ (షాపు నంబర్ 99), ఆకుల నాగన్న (షాపు నంబర్ 100) షాపులు దక్కించుకున్న వారిలో ఉన్నారు.

పశువైద్యాధికారిగా శుభశ్రీ బాధ్యతల స్వీకరణ



శుభశ్రీ

అయినవిల్లి: స్థానిక మండల పశువైద్యాధికారిగా శుభశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. శుభశ్రీ మాట్లాడతూ పశువులకు సీజనల్ వ్యాధులకు రాకుండా ముందస్తు చర్యలు రైతులకు సూచించారు. శుభశ్రీని పలువురు రైతులు సంఘ నాయకులు కలిసి అభినదనలు తెలిపారు.

గుట్టు చప్పుడు కాకుండా..

- లంక గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు
- మామూళ్ల మత్తులో ఉద్యోగులు



ఇసుక నిల్వలు

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీ తీరంలోని లంక గ్రామాల నుంచి గత కొన్ని రోజులుగా ఇసుక అక్రమ తవ్వకాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా పక్కా ప్లాన్‌తో రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఇసుక దందాకు అధికార పార్టీ నేతలే సూత్రదారులు కావడంతో అధికారులు నోరెత్తడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక తవ్వకాలను అడ్డుకోవాల్సిన ఉద్యోగులు సైతం మామూళ్ల మత్తులో చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదుర్రు, పాశర్లపూడి, బాడిలంక, బి.దొడ్డవరం, పెదపట్నం లంక గ్రామాల్లో ఇసుక తవ్వకాలు రహస్యంగా జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇసుకను పడవలపై తీసుకు వచ్చి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇసుకు అక్రమ తవ్వకాలకు ప్రజా ప్రతినిధుల అండదండలు తమకు పుష్కలంగా ఉన్నాయని చెప్పడం కొసమెరుపు.

ఇసుకకు డిమాండ్ .. పెరిగిన ధర

ఇసుకకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అక్రమదారులు ట్రాక్టర్ ఇసుక రూ.3,500 నుంచి రూ.4,500కు విక్రయిస్తున్నారు. ఇసుక తీసే గ్రామాల్లో అయితే రూ.3 వేలు ధరకే విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఇసుక ఎక్కడా దొరకని పరిస్థితి. కూలీలు, తాపీ కార్మికులు ఖాళీగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో అంతా కలిసి ఎటువంటి సమాచారం బయటకు పోకుండా గుట్టు చప్పుడు కాకుండా పని పూర్తి చేస్తున్నారు. ఇసుక అక్రమ దందాలో అధికార కూటమి నేతలదే హవా నడుస్తోంది. అధికారులను ప్రసన్నం చేసుకోవడం, ఇసుకను అక్రమంగా తవ్వించడం, దాన్ని పడవల ద్వారా ఒడ్డుకు చేర్చడం, అక్కడి నుంచి ట్రాక్టర్ల సహాయంతో బయటకు తరలించి అమ్మడం వంటి చర్యలు వారి కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో పరిస్థితులను బట్టి రోజుకు 15 నుంచి 30 ట్రాక్టర్లు వంతున తీస్తున్నారని సమాచారం. కొన్ని చోట్ల ఎక్కువగాను, మరి కొన్ని చోట్ల తక్కువ గాను ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అక్రమ తవ్వకాలను నిరోధించే దిశగా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

నిఘా ఉంచాం

దీనిపై తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులను వివరణ కోరగా దీనిపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. అక్రమ తవ్వకాలను నిరోధించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలి

- జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు
- మండల పరిషత్ కార్యాలయం పరిశీలన



అంబాజీపేటలో సీఈఓ లక్ష్మణరావుకు సమస్యలు వివరిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు

అంబాజీపేట: ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవంతో పాటు తప్పనిసరిగా ఏ అధికారి అయినా ప్రొటోకాల్ పాటించాల్సిందేనని సీఈఓ పీవీవీఎస్ లక్ష్మణరావు చెప్పారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం సీఈఓ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో తప్పనిసరిగా ప్రజా ప్రతినిధులకు ప్రాముఖ్యతనిస్తూ ఫ్లెక్సీలలో వారి ఫొటోలను ప్రొటోకాల్ ప్రకారం ముద్రించాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఐదు మండలాల్లో ఎంపీడీవోలను నియమించాల్సి ఉందన్నారు. అయినవిల్లి అంబాజీపేట, రాజోలు, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం మండలాలకు త్వరలో ఎంపీడీవోలను నియమిస్తామన్నారు. స్థానిక పశువుల మార్కెట్ వద్ద ఉన్న ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ శిథిల స్థితికి చేరిందని దానిని త్వరితగతిన వినియోగం తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. అంతకు ముందు స్థానిక ఎంపీడీవో జి.సరోవర్ ప్రజా ప్రతినిధులను విస్మరిస్తూ ఎటువంటి సమాచారం ఎంపీటీసీలకు ఇవ్వడంలేదని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల ఎంపీటీసీల సమైక్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్‌తోపాటు పలువురు ఎంపీటీసీలు సీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లేకుండానే సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో నిర్వహించడం ఎంత వరకు సమంజసమని సీఈఓకు వివరించారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై ఎంపీటీసీలు తగిన పిలుపు ఉండడం లేదని దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు వివరించారు. స్థానిక ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న జి.సరోవర్‌కు అయినవిల్లి ఏవోగా బదిలీ అయినప్పటికీ ఎందుకు వెళ్లడం లేదని సీఈఓను ప్రశ్నించారు. దీనిపై సీఈఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం వేతనాలు మంజూరు విషయంపై ఎంపీడీవో సంతకం అవసరం ఉందన్నారు. త్వరలోనే ఎంపీడీవో అయినవిల్లి బదిలీపై వెళ్లిపోతారని ఎంపీపీ ఎంపీటీసీలకు వివరించారు. ప్రొటోకాల్ ఉల్లంఘనకు గురికాకుండా తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎంపీటీసీలు వడలి కష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, నూకపయ్య సత్యనారాయణ, మైల ఆనందరావు తదితరులు సీఈఓ కు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

ప్రతి విద్యార్థి ఓటు హక్కు కలిగి ఉండాలని సీఈఓ లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఎస్ఎస్ఎం డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ మట్టపర్తి సాయిప్రసాద్ అధ్యక్షతన ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ జె.వెంకటేశ్వరి ఆదర్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రాధామణి తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం



అంబాజీపేటలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న వైద్యులు

అంబాజీపేట: ప్రస్తుత రోజులలో మహిళలు, యువతులు, బాలికలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ఎంతో అవసరమని స్థానిక స్త్రీల ఆసుపత్రి వైద్యులు జయశ్రీ, రాశి చెప్పారు. అంబాజీపేట, ముంగండ జెడ్పీ హైస్కూల్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీల ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ మగువలకు 40ఏళ్లలో రొమ్ము క్యాన్సర్ ద్వారా ముసలం ఏర్పడుతుందన్నారు. తప్పనిసరిగా ప్రతి మహిళా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఆ ప్రదేశంలో ఏమైనా మార్పులు గమనిస్తే వెంటనే మహిళా వైద్యులను కలిసి తగిన చికిత్స పొందాలన్నారు. కొన్ని సందర్భాల్లో హైస్కూలు విద్యార్థినులతోపాటు కొంత మంది యువతులలో కూడా మార్పులు గమనిస్తున్నామని, అటువంటి లక్షణాలు ఉన్నవారు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వారి తల్లుల సాయంతో వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థినులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆయా హైస్కూలు మహిళా ఉపాధ్యాయులు, స్త్రీల ఆసుపత్రి వైద్యులు షైనీ సరెళ్ల తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం



అంబాజీపేటలో కురుస్తున్న వర్షం

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా అంబాజీపేటలో బుధవారం కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వాహనదారులు ఎక్కడికక్కడ నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్కూళ్ల నుంచి ఇళ్లకు వెళ్లే విద్యార్థులు, చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు. బుధవారం వారపు సంత కావడంతో మార్కెట్‌లో వ్యాపారులు వర్షానికి తడిచి ముద్దయ్యారు. అంబాజీపేట, కె.పెదపూడి, పుల్లేటికుర్రు తదితర గ్రామాల్లో రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి.

మలికిపురం: రాజోలు దీవిలో బుధవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. ప్రధాన కూడళ్లలో వ్యాపార లావాదేవీలకు ఆటంకం ఏర్పడింది. మరో వైపు ఈదురు గాలులు వీయడంతో శివకోడు నుంచి వచ్చే 33/11 కేవీ విద్యుత్ లైన్ తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సిబ్బంది శ్రమించి సరఫరా పునరుద్ధించారు.

గ్రామాభివృద్ధి లక్ష్యంగా 'పల్లె పండుగ'



వానపల్లిలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట: గ్రామాభివృద్ధి లక్ష్యంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని వానపల్లి, బిళ్లకుర్రు, మోడేకుర్రు, అవిడి, గంటి, పలివెల, కొత్తపేట గ్రామాల్లో రూ 2.48 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్, పీఆర్ ఏఈ డీ వీరభద్రరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు పల్లి భీమారావు, బూసి జయలక్ష్మి, సాదే లక్ష్మి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

గోతులమయంగా జాతీయ రహదారి



అధ్వానంగా మారిన పాశర్లపూడి జాతీయ రహదారి

మామిడికుదురు: మీరు చూస్తోంది ఎక్కడో మారు మూల పల్లెటూరులో రోడ్డు అనుకోకండి. ఇది కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న జాతీయ రహదారి. ఈ రోడ్డు గోతులతో అధ్వానంగా మారింది. గోతుల్లో వర్షపునీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇదీ పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్‌లో 216వ నంబర్ జాతీయ రహదారి పరిస్థితి తయారైంది. అసలే అధ్వానంగా ఉన్న సుమారు కిలోమీటరు మేర బీటీ రోడ్డును ఇటీవల ఆధునీకరణ పేరుతో తవ్వేసి మెటల్‌తో పటిష్టం చేశారు. హమ్మయ్య కష్టాలన్నీ తీరిపోతాయని గ్రామస్తులు ఎంతో ఆనంద పడ్డారు. చాలా కాలం నుంచి అధ్వానంగా ఉన్న రోడ్డుకు మోక్షం కలుగుతుందని సంబరపడ్డారు. ఆ ఆనందం కాస్తా కొన్ని రోజులకే ఆవిరైపోయింది. జాతీయ రహదారుల విభాగం అధికారులు మెటల్ వేసి దాన్ని లెవెలింగ్ చేయించి వదిలేశారు. అక్కడి నుంచి స్థానికుల కష్టాలు రెట్టింపయ్యాయి. ఎండ కాస్తే బూడిద, వర్షం కురిసే మడుగు ఇదీ స్థానిక వ్యాపారులు, గ్రామస్తుల ఎదుర్కొంటున్న అవస్థల తీరు. ఈ రోడ్డు పరిస్థితిని నిరసిస్తూ స్థానికులు ఇటీవల రాస్తారోకో కూడా చేశారు. ఇది ఇలా ఉండగా వేసిన మెటల్ కాస్తా చాలా చోట్ల లేచి ఈ రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు పరిస్థితిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మద్యం షాపు తొలగించాలంటూ ఆందోళన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్సై మనోహర్ జోషి



అవిడిలో మద్యం షాపు తొలగించాలని నిరసన తెలుపుతున్న మహిళలు, విద్యార్థులు

అయినవిల్లి: ఇళ్ల మధ్య మద్యం దుకాణం పెట్టొద్దని శానపల్లిలంక తూర్పుపేట మహిళలు బుధవారం ఆందోళన చేశారు. పాత మద్యం షాపు పరిధిలోనే షాపు పెట్టుకోవాలని వారు సూచించారు. నివాస ప్రాంతాల్లో పెట్ట వద్దని గ్రామస్తులు, మహిళలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. పరిస్థితిని సమీక్షించిన పాత మద్యం షాపు వద్దే పెట్టుకోవాలని ఎస్సై మనోహరజోషి యజమానికి సూచించారు. దీంతో పరిస్థితి సద్దు మణిగింది. ఇది ఇలా ఉండగా మండలంలోని మాగాం, శానపల్లిలంక, ముక్తేశ్వరంలోని మద్యం షాపుల వద్ద ప్రభుత్వం తగ్గించిన మద్యం ధరలు కాకుండా పాత ధరలకే మద్యం విక్రయించడంతో మద్యం ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తగ్గిన ధరలకు మద్యం విక్రయించాలని వారు కోరారు.

కొత్తపేటలో...

కొత్తపేట: మండల పరిధిలోని అవిడి రేవు సమీపంలో మద్యం షాపు తొలగించాలంటూ ఆ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గత మద్యం పాలసీలో ఉన్న ప్రభుత్వ మద్యం షాపు స్థానే ప్రస్తుత మద్యం పాలసీలో షాపు ఏర్పాటు చేయగా స్థానికులు షాపును అక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఇళ్ల మధ్యలో ఉన్న మద్యం షాపును తక్షణమే తొలగించాలి. అసాంఘిక కార్యక్రమాలు వలన ఈ దారిన వెళ్లే ప్రజలు, విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. ఫ్లెక్సీలతో నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. పలు షాపుల్లో ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ రేట్లకు మద్యం అమ్మకాలు సాగించారని పలువురు తెలిపారు.

నిధుల కేటాయింపులో వివక్ష



ఎమ్మెల్యే సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ మహాలక్ష్మి

పి.గన్నవరం: నిధుల కేటాయింపులో తమ గ్రామంపై వివక్ష చూపుతున్నారని బెల్లంపూడి సర్పంచ్ బండి మహాలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె పండగ కార్యక్రమం బుధవారం బెల్లంపూడిలో జరిగింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. తమ గ్రామానికి కేవలం రూ.7 లక్షలు మాత్రమే మంజూరు చేశారని సర్పంచ్ వాపోయారు. తదుపరి విడతలో రూ.25 లక్షలు కేటాయించాలని ఆమె కోరారు. గ్రామంలో శివాలయం కాలనీలో డ్రైనేజ్, తాడాలవారిపాలెం, ఎస్సీ పేట, దండోరా పేటల్లో సీసీ రోడ్లు నిర్మించాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు. వైవీ పాలెం, బెల్లంపూడి, ఊడిమూడి, జి.పెదపూడి, కుందాలపల్లి, నరేంద్రపురం, రాజులపాలెం, పోతవరం, ముంగండ గ్రామాల్లో జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎంపీపీ కేవీఎస్ ప్రసాద్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, తోలేటి సత్తిబాబు, వి.కుమార్, సంసాని పెద్దిరాజు, సాధనాల జేడీ పాల్గొన్నారు.

కౌలు రైతులకు ఓటు హక్కు కల్పించాలి



తహసీల్దార్ ఆచార్యులుకు వినతిపత్రం ఇస్తున్న కౌలు రైతులు

మామిడికుదురు: సాగునీటి సంఘం ఎన్నికల్లో తమకు ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరుతూ కౌలు రైతులు తహసీల్దార్ ఆచార్యులకు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. 90 శాతం పైగా పంటలను తామే సాగు చేస్తున్నామని, పంట బోదెలు, మురుగు బోదెలను సైతం తామే బాగు చేసుకుంటున్నామన్నారు. తమ సమస్యలు, బాధలు తెలిసిన వ్యక్తిని ఎన్నుకునే అవకాశం తమకు కల్పించాలని కోరారు. తమ సమస్యలు తెలిసిన వ్యక్తిని అధ్యక్షుడిగా ఎన్నుకోవడం వల్ల తమకు మేలు జరుగుతుందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పీతల రామచంద్రరావు, తాటికాయల ఉదయభాస్కరరావు, రాయుడు ఆనందరావు, తాడి రామకృష్ణ, కేతా సూర్యనారాయణ, పితాని సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఇసుక ర్యాంపుల పరిశీలన



ఊబలంక ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న అధికారులు

రావులపాలెం: మండలంలోని ఊబలంక, పొడగట్లపల్లి గ్రామాల్లో ఇసుక ర్యాంపులను బుధవారం కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్ పరిశీలించారు. ప్రభుత్వం ఇసుక ర్యాంపులను ప్రారంభించనున్న నేపథ్యంలో రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి ర్యాంపులను పరిశీలించారు. వరద ప్రవాహం ఏ విధంగా ఉంది, ఎన్ని రోజుల్లో తవ్వకాలు చేపట్టవచ్చు తదితర విషయాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ముక్తేశ్వరరావు, ఆర్ఐ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నకు హోమియోపతిలో డిగ్రీ



ఆలమూరు: ఇటీవల కాలంలో పల్లెల్లో నివసిస్తున్న అమ్మాయిలు విద్యలో ఉత్తమంగా రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు. ఈ కోవలోనే మండలంలోని బడుగువానిలంకకు చెందిన దూలం ప్రసన్న విజయలక్ష్మి శేషశ్రీ హోమియోపతిలో డిగ్రీ సాధించింది. గ్రామానికి చెందిన దూలం రాంబాబు, వెంకట కనక దుర్గ దంపతుల కుమార్తె ప్రసన్న విజయలక్ష్మి శేషశ్రీ కూడా బెంగళూరులోని భగవాన్ బుద్ధ హోమియోపతి మెడికల్ కాలేజీలో హోమియో కోర్సులైన బీహెచ్ఎంఎస్ విద్య నభ్యసించింది. ఆ కోర్సులో ఉన్నత శ్రేణిలో రాణించిన ఆమె హోమియోపతి యాజమాన్యం చేతుల మీదుగా బుధవారం డిగ్రీ పట్టా అందుకుంది.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



ఆలమూరులో చిన్నారులకు టీకాలను అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవిఅన్నారు. మండలంలోని ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లలతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు.

పెదపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్శిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లను అందజేశారు. దనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డైయేరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హైపటైటీస్ బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను, యాంటి బయాటిక్ మందులను అందజేశారు. హెల్త్, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు

రావులపాలెం: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా రావులపాలెం అంబరు చెరక వద్ద కనక దుర్గమ్మ అమ్మవారిని బుధవారం ఘనంగా ఊరేగించారు. ఈ ఊరేగింపులో కోలాటం, వివిధ దేవతామూర్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నేడు కొత్తపేట మండల పరిషత్ సమావేశం

కొత్తపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. మండల పరిషత్ సభ్యులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీఓ నరేష్‌కుమార్ కోరారు.